సాక్షి
కృష్ణాజిల్లా
ఆదివారం, 12, మే, 2024



దుర్గగుడికి విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన చిటమట కనకాంబరం పేరిట సి. ఏడుకొండలు రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



స్ట్రాటజిక్ వింగ్ ప్రారంభం

రైల్వేస్టేషన్: రైల్వే పర్సనల్ బ్రాంచ్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'స్ట్రాటజిక్ వింగ్'ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ లాంఛనంగా శనివారం ప్రారంభించారు.



	కనిష్టం	గరిష్టం
మచిలీపట్నం	29	36
గుడివాడ	28	38
నందిగామ	27	37.9
జగ్గయ్యపేట	28	38

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల సందర్శన



బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాలను మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు అక్కనూరు ప్రసాద్‌ప్రహ్లాద్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన పోలీస్ అధికారులతో కలసి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. మండలంలోని 45 పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక, అతిసమస్యాత్మక కేంద్రాల వివరాలను ఎస్ఐ జి.వాసును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించిన ఆయన అధికారులతో కలసి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. డీఎస్పీ ఎం.రమేష్, పెడన సీఐ కె. నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రలోభాల పర్వం ఆరంభం

సాక్షి, మచిలీపట్నం: ఎన్నికల తేదీ సమీపించడంతో కొంతమంది అభ్యర్థులు ప్రలోభాల పర్వానికి తెరతీశారు. శనివారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. సుమారు 58 రోజుల పాటు ప్రజల్లో ఉంటూ తాము గతంలో చేసిన మంచి ఏమిటో, గెలిస్తే చేసేది ఏమిటో చెప్పుకోలేక ఓటర్లను ఆకర్షించేందుకు అనేక పాట్లు పడిన అభ్యర్థులు కొందరు డబ్బుతో ఎన్నికల్లో గట్టెక్కాలని ప్రలోభాలు చేపట్టారు. 70 శాతం మందికి పైగా ఓటర్లకు డబ్బు పంచేందుకు నిర్ణయించారని సమాచారం. కొంత మంది శుక్రవారం నుంచే డబ్బు పంపిణీ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కొంత మంది అభ్యర్థులు ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు నగదు పంపిణీ చేస్తున్నారని సమాచారం. గన్నవరం, పామర్రు, గుడివాడలో చేసిన మంచి ఏమిటో చెప్పుకోలేని పార్టీల నాయకులు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. డబ్బు పంపిణీలో కొంత మంది ఎన్ఆర్ఐలు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

సర్వం సిద్ధం



మచిలీపట్నంలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ తదితరులు

- నేడు ఎన్నికల సామగ్రితో బయలుదేరనున్న 20 వేల మంది సిబ్బంది
- రేపు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసిన జిల్లా యంత్రాంగం
- 15,39,604 మంది ఓటు వేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా ముగిసిన రాజకీయ పార్టీల ప్రచారపర్వం

సాక్షి, మచిలీపట్నం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు కృష్ణా జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. ప్రధాన పార్టీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రాధాన్యత నెలకొంది. పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు ఆరు నెలల ముందు నుంచే వివిధ రూపాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తూ వచ్చిన అధికారులు ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఓటర్ల నమోదు, తుది జాబితా తయారీ నుంచి సిబ్బందికి శిక్షణ, కోడ్ అమలు, నోటిఫికేషన్ జారీ, నామినేషన్లు, దరఖాస్తుల పరిశీలన, ఉప సంహరణలు, ప్రచారం ఇలా అన్నింటినీ నిబంధనల మేరకు నిర్వహిస్తూ వచ్చారు. చివరగా పోలింగ్ ప్రక్రియ మాత్రమే మిగిలింది. దీనిని కూడా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

1,010 ప్రాంతాల్లో 1,768 పోలింగ్ కేంద్రాలు

సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా 1,010 ప్రాంతాల్లో 1,768 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 158 ప్రాంతాల్లోని 391 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వాటిలో అత్యధికంగా గన్నవరం నియోజకవర్గంలో 41 ప్రాంతాల్లో 111 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే ఈ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో భాగంగా ఆదివారం సాయంత్రమే తమకు కేటాయించిన ప్రాంతాలకు ఎన్నికల సామగ్రితో బయలుదేరి వెళ్లనున్నారు.

మూగబోయిన మైకులు

ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికలకు మార్చి 16వ తేదీన షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వచ్చింది. దీంతో రాజకీయ పార్టీలు బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లు ఖరారు చేసినప్పటి నుంచే ప్రచారాలు ప్రారంభమయ్యాయి. ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎన్నో పాట్లు పడ్డారు. సుమారు రెండు నెలల పాటు మోగిన మైకులు, డీజే సౌండ్స్, ఎల్ఈడీలు శనివారం సాయంత్రం ఆరు గంటలతో మూగబోయాయి.

పోలింగ్ సెంటర్లలో వసతులు

ఎన్నికల్లో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు 15,39,460 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. వారిలో అత్యధికంగా మహిళలు 7,93,332 మంది, పురుషులు 7,46,071 మంది, థర్డ్ జెండర్లు 57 మంది ఉన్నారు. మూడు లక్షల మంది యువతీయువకులు ఉండగా, వారిలో తొలిసారి ఓటు వేసేవారు 36,712 మంది. వారి కోసం అన్ని పోలింగ్ సెంటర్లలో తగిన వసతులు కల్పించారు. ముఖ్యంగా విద్యుత్, మంచినీరు, టాయిలెట్లు, సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ తదితర సౌకర్యాలు కల్పించారు.

ఏర్పాట్లు పూర్తి



సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తిచేశాం. ఉద్యోగులు, సిబ్బంది ఆదివారమే తమకు కేటాయించిన ప్రాంతంలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎన్నికల సామగ్రితో బయలుదేరి సాయంత్రంలోపు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారు. ఇందు కోసం ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాలు సిద్ధం చేశాం. ఈవీఎంలు, ఇతర సామగ్రి అన్నీ కట్టుదిట్టమైన భద్రత మధ్య తీసుకెళ్లి, పోలింగ్ ముగిశాక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తాం. పోలింగ్ సరళిని కూడా వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ పర్యవేక్షణలో నిర్వహిస్తాం.

– డి.కె.బాలాజీ,
కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట భద్రత

సాక్షి,మచిలీపట్నం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లు పూర్తిచేశారు. పోలింగ్‌కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పోలీసులతో పాటు ఎనిమిది కేంద్ర బలగాల కంపెనీలు జిల్లాకు చేరుకున్నాయి. సీఐఎస్ఎఫ్, ఆర్పీఎఫ్ నుంచి వచ్చిన బలగాలు ఇప్పటికే జిల్లాలో కవాతు (మార్చ్ ఫాస్ట్) నిర్వహించి అవగాహన, భరోసా కల్పించాయి. ఒక్కో నియోజకవర్గానికి ఒక సీనియర్ పోలీస్ అధికారిని బాధ్యుడిగా నియమించారు. ఆ అధికారి పర్యవేక్షణలో జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయి. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ప్రతి నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) బృందాలను, ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్లను సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ కోరారు.

ప్రత్యేక తనిఖీ బందాలు

జిల్లాలో స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్ఈ), ఫ్లయింగ్ స్క్వాడ్స్ (ఎఫ్ఎస్ఈ) బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో రెవెన్యూ, ఒక పోలీస్ అధికారి కూడా ఉంటారు. డబ్బు, ఇతర కానుకలు పంపిణీ చేస్తున్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్, లేదా స్టేషన్‌కు ఫిర్యాదు వస్తే పోలీసులు ఎంసీసీ బృందాలకు చేరవేస్తున్నాయి. ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలు లభిస్తే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వాటిని సీజ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. పార్టీల నేతలు, ప్రజలు నేరుగా కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.

ప్రత్యేక పోలీసు బృందాలు రాక

జిల్లా పోలీసులతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి ఎనిమిది కేంద్ర బృందాలు వచ్చాయి. ఒక్కో కంపెనీ బృందంలో సీఐ, ఎస్ఐ కేడర్‌తో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ స్థాయి సిబ్బంది 80 మంది ఉంటారు. ఏపీఎస్పీకి చెందిన రెండు మూడు ప్లటూన్ల (ఒక్కో ప్లటూన్‌లో 20 మంది)ను వినియోగించుకోనున్నారు. జిల్లాకు వచ్చిన పోలీసు అబ్జర్వర్ ప్రసాద్ ప్రహ్లాద్ పర్యవేక్షణలో భద్రత చర్యలు చేపట్టారు.

భద్రతా ఏర్పాట్లు పూర్తి

ఎన్నికలు నిర్వహణకు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెట్టామన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు సహకరించాలని కోరారు. పోలింగ్‌కు అడ్డంకులు కలిగిస్తే చేస్తే చర్యలు తప్పవన్నారు.

అభ్యర్థులు ప్రచారం చేయకూడదు

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13వ తేదీ పోలింగ్ జరగనున్న దృష్ట్యా 48 గంటల ముందు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్–126ఏ ప్రకారం ఎగ్జిట్‌పోల్ నిర్వహించడం, ఎన్నికల ఫలితాలను వ్యాప్తి చేయడంపై నిషేధం ఉందని పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ కూడా తీసుకోకూడదని స్పష్టంచేశారు. టీవీల్లో ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రదర్శించకూడదని సూచించారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, సంగీతవిభావరి పేరుతో ఎన్నికల సంబంధ ప్రచారం చేయొద్దని పేర్కొన్నారు. పత్రికా సమావేశాలు, ఇంటర్వ్యూల ద్వారా ఎన్నికలకు సంబంధించిన అంశాలను వెల్లడించకూడదని స్పష్టంచేశారు. పోలింగ్ విధుల్లో ఉన్న అధికారులు మినహా పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లలోపు సెల్‌ఫోన్లు వాడొద్దని, మద్యం విక్రయించడం, పంపిణీ చేయడం నేరమని హెచ్చరించారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లను రాజకీయ ప్రచారం కోసం వినియోగించకూడదని స్పష్టంచేశారు.

చారిత్రక పురి.. అభివృద్ధే గురి

ఐదేళ్లలో మారిన కొండపల్లి రూపురేఖలు

- 2021లో పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా రూపాంతరం
- దాదాపు రూ.80.16 కోట్లతో అభివృద్ధి పనులు
- మరో రూ. 207.35 కోట్లతో 67,515 మందికి సంక్షేమం
- విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్ద పీట



కొండపల్లిలోని రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల భవనం



కొండపల్లి బొమ్మల కళాకారులకు నిర్మించిన నూతన శిక్షణ భవనం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దాదాపు 700 ఏళ్ల చరిత్ర కలిగి కొండపల్లి ప్రస్తుతం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. 1956 నుంచి 2020 వరకు మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కొండపల్లిని.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2021 జనవరిలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి జంట గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. చరిత్రకు ఆనవాళ్లుగా కొండపల్లి ఖిల్లా, బొమ్మల పరిశ్రమ, విద్యుత్ వెలుగులు విరజిమ్మే నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్, కొండపల్లి ఇండస్ట్రియల్ డెవలప్ ఏరియా(ఐడీఏ) ఆప్మెల్ సంస్థ, దూరదర్శన్ కేంద్రం, రైల్వే స్లీపర్ల తయారీ సంస్థ, పట్టణ ఒడ్డున కృష్ణమ్మ పరవళ్లు ఈ ప్రాంతానికి తలమానికంగా నిలిచాయి. గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని కొండపల్లి.. ఈ ఐదేళ్లలో ప్రగతి పథాన పయనిస్తోంది.

విద్య, వైద్యం అద్భుతః..

ఐదేళ్ల కాలంలో విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. ఇప్పటికే రెండు పీహెచ్‌సీలు ఉన్న కొండపల్లిలో ప్రతి 30 వేల జనాభాకు ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం చొప్పున ఒక్కొక్కటి రూ.96.50 లక్షల చొప్పున రూ.1.93కోట్లతో రెండు అర్బన్ యూపీహెచ్‌సీలు నిర్మించింది. రూ.2 కోట్లతో బొమ్మల పరిశ్రమ అభివృద్ధి, ఎన్టీటీపీఎస్, ఐడీఏలో పనిచేసే అసంఘటిత కార్మికుల ఆరోగ్య ప్రయోజనాల కోసం రూ.54 లక్షలతో ఈఎస్ఐ వైద్యశాల నిర్మించింది. నాడు – నేడు పథకంలో రూ.6 కోట్లతో 14 పాఠశాలలు, ఏపీ గిరిజన గురుకుల బాలికల సంక్షేమ హాస్టల్, బీసీ గురుకుల సంక్షేమ బాలుర హాస్టల్ అభివృద్ధి చేశారు. జెడ్పీ బాలికల పాఠశాలలో జూనియర్ కళాశాల మంజూరు చేసి అదనపు గదులు నిర్మించింది. పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియాన్ని చేరువ చేసింది.

చేరువైన పాలన..

73,580 మంది జనాభా కలిగిన కొండపల్లిలో పరిపాలనా సౌలభ్యం కోసం 10 వార్డు సచివాలయాలు నిర్మించారు. 340 మంది వలంటీర్లు, 90 మంది సచివాలయ ఉద్యోగుల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయి. ఐదేళ్లలో ప్రజల నుంచి 31,357 అర్జీలు స్వీకరించి 28,186 అర్జీలు పరిష్కరించారు. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, లానేస్తం, తదితర పథకాలు 73,580 మంది జనాభాలో 67,515 మందికి రూ.207.35 కోట్లు నగదు డీబీటీ ద్వారా అందాయి.

రూ.80.16 కోట్లతో అభివృద్ధి పనులు..

- గత ఐదేళ్లలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా విడుదలైన రూ.80.16 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- ఎస్సీ సబ్‌ప్లాన్ రూ.75 లక్షలతో ఆర్సీఎం కాలనీలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు.
- ప్రభుత్వ నిధులు రూ.4 కోట్లతో 10 నూతన సచివాలయాలు నిర్మించారు. 14, 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్స్ రూ.10.70 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు జరిగాయి.
- ప్రభుత్వ నిధులు రూ.1.50 కోట్లతో పైప్‌లైన్ ఆధునికీకరణ పనులు జరిగాయి.
- అమృత్ 0.2 నిధులు రూ.1.45కోట్లతో గజరాజు చెరువు, రూ.1.93 కోట్లతో రెండు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, రూ.కోటితో 4 కమ్యూనిటీ భవనాలు నిర్మించారు.
- నాడు – నేడు పథకం నుంచి రూ.6 కోట్లతో 14 పాఠశాలలు, బాలికలు, బాలుర హాస్టల్స్ అభివృద్ధి చేశారు.
- రూ.54 లక్షలతో ఈఎస్ఐ వైద్యశాల నూతన భవన నిర్మాణం చేశారు.
- జగనన్న కాలనీల్లో రూ.1.50 కోట్లతో విద్యుత్ సదుపాయం కల్పించారు. 3,120 మందికి స్థలాలు కేటాయించగా, ఇళ్లు పూర్తి చేసిన 2,709 మందికి రూ.48.79 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.
- ఇవికాక మరో రూ.63 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకం పనులు టెండర్ దశలో ఉన్నాయి.

ఐదేళ్లల్లో రెట్టింపు అభివృద్ధి..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో కొండపల్లి రూపురేఖలు మారాయి. సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఉచితంగా పొందగలుగుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సదుపాయం మెరుగైంది. మరో ఐదేళ్లు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నా.

– డి.మల్లికార్జునరావు, స్థానికుడు, ఇబ్రహీంపట్నం

విద్య, వైద్య రంగాల్లో మార్పులు..



కొండపల్లి మునిసిపాలిటీ అయ్యాక విద్య వైద్య రంగాలు మెరుగుపడ్డాయి. రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఒక ఈఎస్ఐ వైద్యశాల నిర్మించారు. ఏ అనారోగ్య సమస్య వచ్చినా యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలు, మెడికల్ టెస్టులు పక్కాగా నిర్వహిస్తున్నారు. నాడు – నేడులో భాగంగా చేసిన పాఠశాలల అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుంది.

– పచ్చిగోళ్ల పండు, స్థానికుడు, కొండపల్లి

విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ జగన్

వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): విశ్వసనీయతకు మారుపేరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. వేమిరెడ్డిపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామిదాసు విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల్లో విశ్వసనీయతను సంపాదించారన్నారు. స్థానికుడినైన తనను, కేశినేని శ్రీనివాస్ (నాని)ని ఎంపీ అభ్యర్థిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, సర్పంచ్ పంతంగి విజయకుమారి, ఎంపీటీసీ వి. సత్యనారాయణచారి, సొసైటీ అధ్యక్షుడు రాయల వెంకట సత్యనారాయణ, స్థానిక నాయకులు నెక్కళపు సుబ్బారావు, నెక్కళపు శివయ్య, సూరా వెంకట్రామయ్య, రాష్ట్ర ఎస్టీ నాయకుడు భూక్యా రాము పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



జూపూడి(ఇబ్రహీంపట్నం): ఇటీవలి కాలంలో వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన తురకా దుర్గారావు తన బంధువులు వారం తిరగక ముందే ఆ పార్టీని వీడి సొంతగూడికి వచ్చేశారు. మైలవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, కలతోటి కొండలరావు, బాణావత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2,400 మద్యం బాటిళ్ల స్వాధీనం



వెల్లంకి(వీరులపాడు): మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. మండలంలోని వెల్లంకి గ్రామ సమీపంలోని ఎర్రగుట్ట వద్ద అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను శనివారం ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం అక్రమంగా నిల్వ చేశారనే సమాచారం రావటంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. మొత్తం రూ.3.50 లక్షల విలువ చేసే 50 కేసుల్లో 2,400 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిర్మానుష్య ప్రదేశంలో ఉన్నాయని అక్కడ ఎవరూ లేకపోవటంతో దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడిలో ఎస్ఐ నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. పట్టుబడిన మద్యం టీడీపీ నాయకులకు చెందినదిగా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కావటంతో ఓటర్లకు పంచేందుకు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



కురుమద్దాలి(పామర్రు): విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారిపై కురుమద్దాలి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి బల్లిపర్రు గ్రామానికి చెందిన కలపాల చంద్(24), బి.నాగేశ్వరరావులు తమ బైక్‌పై కురుమద్దాలి గ్రామానికి జాతీయ రహదారిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో కురుమద్దాలి వద్దకు రాగానే బైక్ లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో చంద్ రోడ్డుపై పడిపోవడంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తి నాగేశ్వరరావుకు గాయాలు అవ్వడంతో మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు.. వ్యక్తి మృతి

గౌరవరం(జగ్గయ్యపేట): డివైడర్‌ను కారు ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గౌరవరం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రెడ్డి సాయిప్రసాద్(58) తన ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి ఏలూరు ఫంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా గ్రామంలోని జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా కారు పంచర్ అయ్యింది. దీంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న ప్రసాద్ కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారు. చిల్లకల్లు ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



పామర్రులో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

పామర్రు: సాధారణ ఎన్నికల సందర్భంగా 77–పామర్రు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ శనివారం రాత్రి పరిశీలించారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆర్వో బి.శ్రీదేవి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13వ తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం ఉదయం ఆయా అసెంబ్లీ నియోజవర్గాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వచ్చి పోలింగ్ మెటీరియల్ తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తారని చెప్పారు. పామర్రు నియోజకవర్గంలో 238 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో రూట్లు, పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ సకాలంలో జరగాలని, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, ఆహారం, కనీస వసతులు కల్పించాలని రిటర్నింగ్ అధికారికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పామర్రు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల బందోబస్తుకు సంసిద్ధం

- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- జిల్లా ఎస్పీ అస్మి



కోనేరుసెంటర్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల బందోబస్తుకు పోలీసు యంత్రాంగం సంసిద్ధంగా ఉన్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎవరైనా వ్యవహరిస్తే అటువంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో ఇప్పటికే ప్రత్యేక బలగాలు విధుల్లో ఉన్నాయన్నారు. జిల్లా పోలీసులతో పాటు మిలటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు అధికారులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌ల సేవలను వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు 2,611 కేసులు నమోదు చేసి, 10,026 మందిని బైండోవర్ చేశామన్నారు. 51 మందిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌లు అమలు చేశామని తెలిపారు. జిల్లాలో 1686 పోలింగ్ కేంద్రాలు ఉండగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నగదు, మద్యం, ఇతర సామగ్రి అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి..

జిల్లాలో 2,172 మంది సిబ్బందిలో 2,064 మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎస్పీ తెలిపారు. 160 లైసెన్స్‌లు కలిగిన వ్యక్తుల నుంచి 133 ఆయుధాలను డిపాజిట్ చేశామని, మిగిలిన 27 బ్యాంకులు, ఇతర సెక్యూరిటీ ప్రాంతాల్లో ఉంచామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్నికల నియమావళిని ఉల్లంఘనపై 18 కేసులు నమోదు చేయటంతో పాటు రూ.7,23,17,075లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న రూ.94,30,467ల విలువైన మద్యాన్ని పట్టుకున్నామన్నారు. 464 కేజీల గంజాయితో పాటు రూ.1,69,93,843ల విలువ కలిగిన ఆభరణాలు, రూ.29,82,135ల ఖరీదు చేసే వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తంగా 1,605 కేసులకు సంబంధించి రూ..10,56,90,810లను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఓటు హక్కును జిల్లా ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

ప్రచార పర్వం

సదా మీ సేవలో..



వైఎస్సార్ సీపీ గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నందివాడ మండలంలోని జనార్దనపురం(జొన్నపాడు) గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆదరించాలని కోరారు. – నందివాడ

అండగా ఉంటా..




వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు(కృష్ణమూర్తి) పల్లెతుమ్మలపాలెం, పాతేరు, పోలాటితిప్ప గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాలకు అండగా ఉంటానని.. అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. – కోనేరుసెంటర్

పామర్రులో ఫ్యాన్ జోరు



వైఎస్సార్ సీపీ పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ శనివారం చేపట్టిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి విశేషంగా స్పందన లభించింది. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రారంభించిన భారీ బైక్ ర్యాలీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. – పామర్రు



క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి యాదవ మహాసభ నేత 'పచ్చిపాల'



జగ్గయ్యపేటఅర్బన్: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయన శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సమక్షంలో చేరారు. ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పచ్చిపాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు నచ్చి తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. పెనుగంచిప్రోలు దేవస్థానం చైర్మన్ పదవి, పేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కూడా యాదవ సామాజిక వర్గానికి ఇవ్వడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉదయభాను ఇస్తున్న ప్రాధాన్యత స్ఫూర్తిదాయకం అన్నారు. తెలుగుదేశం పార్టీలో ఈ విధంగా బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కుంభం వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కోసూరి ప్రహ్లాద్, మండల బీసీ నాయకుడు మార్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా ఎన్నికల ప్రచారం



విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహించి విజయవాడ ప్రజల దృష్టిని ఆకర్షించాడీ యువకుడు. కృష్ణలంకకు చెందిన శివకుమార్ తన ద్విచక్ర వాహనాన్ని పూర్తిగా వైఎస్సార్‌సీపీ స్టిక్కర్లతో చుట్టేశాడు. ఆ పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌ను వాహనం ముందు అమర్చి వీధుల్లో చక్కర్లు కొడుతూ ప్రజల దృష్టిని ఆకర్షించాడు. వెల్డింగ్ వర్కర్‌గా జీవనం సాగిస్తున్న తాను సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడనై.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకుని పార్టీ తరఫున స్వచ్ఛందంగా ప్రచారం చేసినట్లు శివకుమార్ చెప్పారు.

బందరులో అభివృద్ధి లంగరు



ప్రధాన పార్కులో ఏర్పాటు చేసిన ఐ లవ్ మచిలీపట్నం బోర్డు

శతాబ్దాల చరిత గల మచిలీపట్నంలో ఈ అయిదేళ్లలో గతంలో ఎన్నడూ జరగనంత అభివృద్ధి జరిగింది. బందరు రూపురేఖలు మారిపోయాయి. నగర సుందరీకరణతో పాటు ఉద్యాన వనాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. చాలా కాలం తర్వాత బందరు వచ్చిన వారెవరైనా ఇది నిజంగా మన బందరేనా అని నమ్మలేనంతగా నగరంలో అభివృద్ధి జరిగిందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.



మచిలీపట్నంలో ప్రారంభమైన వైద్య కళాశాల

- కోట్లాది రూపాయలతో నగరపాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులు
- పాఠశాలలు, అర్బన్ హెల్త్‌సెంటర్ల నిర్మాణం, అభివృద్ధి
- మౌలిక వసతుల కల్పన

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. ఈ ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నగరపాలక సంస్థగా రూపాందిన తరువాత అభివృద్ధి పరుగులు పెట్టింది. మౌలిక వసతులతో పాటు ల్యాండ్ మార్క్‌గా నిలిచే పలు అభివృద్ధి పనులు జరిగాయి. కోట్లాది రూపాయలతో నగరంలో అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయి. నగర ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులను సుందరంగా తీర్చిదిద్దారు.

20 వేల మందికి ఇళ్ల స్థలాలు

నగర పరిధిలోని అర్హులైన 20 వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయగా వాటిలో వేలాది మంది ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. నగరంలోని అర్హత ఉన్న లబ్ధిదారులకు కరగ్రహారంలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోని అతి పెద్ద లేఅవుట్‌లో 10 బ్లాక్‌లలో 17 వేల మందికి స్థలాలు ఇచ్చారు. బందరుకోట, గిలకలదిండి, ఉల్లింగిపాలెం, రుద్రవరం తదితర ప్రాంతాల్లో సుమారు 3 వేల మందికి స్థలాలు ఇచ్చారు. ఈ లేఅవుట్లలో విద్యుత్ సదుపాయం కల్పించారు. దీంతో నగరవాసులతో కొత్త ఊళ్లు ఏర్పాటయ్యాయి.

రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు

ఎంయూడీఏ నిధులు రూ.20 కోట్లతో నగరంలోని అన్ని డివిజన్లలో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు, పైప్‌లైన్లు వంటి పనులు నిర్వహించారు. ఈ పనులతో ఆయా డివిజన్లలో ప్రజలకు మౌలిక వసతులు ఒనగూరాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న చిన్న, చిన్న సమస్యలు తీరటంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రూ.3 కోట్లతో బస్టాండ్ అభివృద్ధి

నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నాటి రవాణాశాఖ మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో నిధులు రాబట్టడంతో బస్టాండ్ అభివృద్ధి సాధ్యమైంది. పల్లంగా ఉన్న బస్టాండ్ ఆవరణ మెరక చేయటంతో పాటు ఎలివేషన్, భవనాల నిర్మాణం తదితర పనులు చేశారు. ఆధునిక హంగులతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఉద్యోగులు, కార్మికులకు వైద్యసేవల కోసం నూతన డిస్పెన్సరీ భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల నిర్మాణం

నగరంలో రూ.3.20 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్ల భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రైలుపేట, శారదానగర్‌లలో రూ.80 లక్షల చొప్పున నిధులతో భవనాలు పూర్తయ్యాయి. గిలకలదిండిలో శ్లాబ్ పూర్తి చేసి నిర్మాణంలో ఉంది. బైపాస్‌రోడ్డులోని బ్రహ్మంగారి మఠం వద్ద స్థలవివాదం ఉండటంతో ఈ భవనం నిర్మాణం ప్రారంభం కాలేదు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో రూ.2కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వసతులు ఏర్పడ్డాయి.

పథకం	లబ్ధిదారుల సంఖ్య	నిధులు (రూపాయల్లో)
డీబీటీ	1,94,528	622,46,48,675
నాన్ డీబీటీ	83,533	621,23,54,789
మొత్తం	2,78,061	1243,70,03,464

రూ.3.76 కోట్లతో పార్కుల అభివృద్ధి

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పార్కు స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేశారు. దాదాపు రూ.3.76 కోట్లతో పార్కులను అభివృద్ధి చేశారు. నగరంలోని శ్రీనివాసనగర్, షార్కీకాలనీ, బచ్చుపేట ప్రాంతాల్లో పార్కు స్థలాల్లో నూతన పార్కులను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో ఉన్న మెయిన్ పార్కులో పలు అభివృద్ధి పనులు చేశారు. దీంతో పార్కులకు వచ్చే సందర్శకులు ఆహ్లాదంగా గడుపుతున్నారు.



బాస్కెట్‌బాల్ కోర్ట్

రూ.169 కోట్లతో టిడ్కో గృహాలు, వసతుల కల్పన

నగరంలోని గోసంఘం, రుద్రవరం ప్రాంతాల్లో జీ+3 టిడ్కో గృహాల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశారు. గోసంఘం వద్ద రూ. 73.94 కోట్లతో మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు 18 బ్లాక్‌లలో 864 ఫ్లాట్లు నిర్మించారు. రుద్రవరంలో రూ.95.06 కోట్లతో 30 బ్లాక్‌లలో 1440 ఫ్లాట్లను మౌలిక సదుపాయాలతో నిర్మించారు.



గోసంఘంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు



షార్కీ కాలనీలోని పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వస్తువులు

నాడు - నేడులో పాఠశాలల అభివృద్ధి

నగరంలోని పలు మునిసిపల్ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. మొదటి విడత నాడు - నేడు పనులను రూ.13.08 కోట్లతో పూర్తి చేశారు. 67 పాఠశాలల్లో 548 పనులు చేశారు. రెండో విడత నాడు - నేడు పనులకు రూ.21.80 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.10 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో 60 పాఠశాలల్లో 346 పనులు చేపట్టారు.



అభివృద్ధి చెందిన ఈడేపల్లి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల

రూ.2.5 కోట్లతో ఇండోర్ స్టేడియం

నగరంలోని జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా శాప్ నిధులు రూ.2.50 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేశారు. దీంతో పాటు టెన్నిస్, బాస్కెట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటి వరకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డ క్రీడాకారులకు ప్రోత్సాహం లభించింది.



ఇండోర్ స్టేడియం

రూ.12 కోట్లతో కలెక్టరేట్ ఆధునికీకరణ

నగరంలోని కలెక్టరేట్‌లో ఆధునికీకరణ పనులను రూ.12 కోట్లతో చేపట్టారు. పనులు చివరి దశకు చేరాయి. ప్రహరీ నిర్మాణం, సుందరీకరణ, మూడు సింహాల స్థూపం, విద్యుద్దీకరణ పనులు, వీడియో కాన్ఫరెన్స్ హాలు తదితర పనులు నిర్వహించారు. కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా తీర్చిదిద్దారు.



సుందరీకరణతో వెలుగులు నింపుకొన్న కలెక్టరేట్

కృష్ణాలో పారిశ్రామిక విప్లవం

- చిన్న తరహా పరిశ్రమలకు ఊతం
- ఎంఎస్‌ఎంఈలకు అధిక ప్రాధాన్యం
- సర్కారు సాయంతో ముందుకు వచ్చిన ఔత్సాహికులు
- కృష్ణాజిల్లాలో నాలుగున్నరేళ్లలో 5,579 పరిశ్రమల ఏర్పాటు
- రూ.722.73 కోట్ల పెట్టుబడులు
- 19,935 మందికి ఉద్యోగ అవకాశాలు



సాక్షి, మచిలీపట్నం: ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలి. ఇందుకు పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలు నెలకొల్పాలి. ప్రధాన జీవనాధారం వ్యవసాయమే అయినా రోజురోజుకు సమాజంలో వస్తున్న మార్పు కారణంగా ఏదైనా కొలువులో స్థిరపడాలనేది నేటి తరం యువత కల. అది ప్రభుత్వ ఉద్యోగమైనా.. ప్రైవేటుది అయినా సరే. అయితే అత్యధికంగా పోటీ ఉండే ప్రభుత్వ ఉద్యోగం కంటే పారిశ్రామిక రంగంలో రాణించేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. స్మాల్ స్కేల్, మైక్రో తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ ఐదేళ్లలో జిల్లాలో పారిశ్రామిక రంగం పరుగులు తీసింది. ప్రభుత్వం అందించే సహాయంతో ముందుకు వచ్చిన ఔత్సాహికులు తమ ఆలోచనా విధానాలకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారు. చిన్న తరహా పరిశ్రమలే అయినా తమతో పాటు మరి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించి ఆసరాగా ఉంటున్నారు. ఫలితంగా జిల్లాలో వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

గుడివాడలో అత్యధికంగా...

జిల్లాలోని 25 మండలాల్లోనూ చిన్న పరిశ్రమలు కొత్తగా స్థాపించారు. నాలుగున్నరేళ్లలో ఒక్కో మండలంలో కనీసం 40కి పైగా ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటయ్యాయి. ఇందులో అత్యధికంగా గుడివాడ మండలంలో రూ.74.59 కోట్లతో 776 ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేయగా 2,071 మందికి ఉపాధి అవకాశాలు వరించాయి. అయితే మచిలీపట్నంలో రూ.93.36 కోట్లతో ఏర్పాటు చేసిన 681 ఎంఎస్‌ఎంఈల ద్వారా అత్యధికంగా 3,071 మందికి ఉపాధి లభించడం గమనార్హం.

సింగిల్ డెస్క్ విధానంతో వేగంగా ప్రక్రియ

పరిశ్రమ ఏర్పాటు చేయాలంటే అందుకు ఐదారు శాఖల అనుమతులు అవసరం. ముఖ్యంగా పరిశ్రమల శాఖతో పాటు లేబర్, స్థానిక సంస్థలు, విద్యుత్, జీఎస్టీ లాంటి అనుమతులను జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు ఆయా శాఖల అధికారులతో సంప్రదించి అనుమతులు ఇప్పించేందుకు అన్ని విధాలా సహకరిస్తారు. దీంతో ఔత్సాహికుడు అన్ని శాఖలకు తిరగాల్సిన అవసరం ఉండదు. ప్రతి నెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి రాయితీ విడుదలపై చర్చిస్తున్నారు.

నాలుగేళ్లలో రూ.772 కోట్లతో 5,579 ఎంఎస్‌ఎంఈలు

కృష్ణాజిల్లాలో సహజ వనరులు పుష్కలంగా ఉండడంతో చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వీలు దక్కింది. ప్రభుత్వ సహకారంతో ఔత్సాహికులు తమ ఆలోచన, అభిరుచులకు తగ్గట్లు రూ.772.73కోట్లతో 5,579 ఎంఎస్‌ఎంఈలు (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) ఏర్పాటు చేసుకున్నారు. దీని వల్ల 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. మరోవైపు గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలంలో నాలుగు లార్జ్, అండ్ మీడియం పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.6 కోట్లు పెట్టుబడి పెట్టగా వీటి ద్వారా 2,300 మందికి ఉపాధి అవకాశాలు దక్కాయి.

నాలుగున్నరేళ్లలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన ఎంఎస్‌ఎంఈల వివరాలు:

మండలం	ఏర్పడిన ఎంఎస్‌ఎంఈల సంఖ్య	ఉపాధి పొందిన వారు	పెట్టుబడి (రూ. లక్షల్లో)
అవనిగడ్డ	95	338	1278
బంటుమిల్లి	110	313	1429.45
బాపులపాడు	199	2968	7682.61
చల్లపల్లి	203	568	2256
గన్నవరం	370	1934	7302.8
ఘంటసాల	44	104	5359
గుడివాడ	776	2071	7459.29
గుడ్లవల్లేరు	437	739	2496.7
గూడూరు	275	894	2906
కంకిపాడు	121	372	1394
కోడూరు	98	323	1771.5
కృత్తివెన్ను	202	268	1028.5
మచిలీపట్నం	681	3071	9336.02
మోపిదేవి	57	165	417.9
మొవ్వ	102	291	826.8
నాగాయలంక	150	310	1435.5
నందివాడ	187	304	1435.3
పామర్రు	145	626	1491.807
పమిడిముక్కల	88	237	892
పెడన	152	382	1227.96
పెదపారుపూడి	88	215	553.813
పెనమలూరు	463	2116	7666.06
తోట్లవల్లూరు	140	351	1372
ఉంగుటూరు	79	143	478.5
ఉయ్యూరు	218	668	1700.49
వైఎస్సార్ తాడిగడప	99	164	1075
మొత్తం	5,579	19,935	722,73 కోట్లు

రాయితీలతో చేయూత

చిన్న, మైక్రో పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలతో ప్రభుత్వం అండగా ఉంటోంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఔత్సాహికులకు ఉత్పత్తి పరిశ్రమ అయితే రూ.50 లక్షల వరకు రుణం, సర్వీసింగ్ సెక్టారులో రూ.20లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జగనన్న బడుగు వికాసం కింద ఉత్పత్తి సంస్థలకు రూ.1.20 కోట్ల వరకు సబ్సిడీ కల్పిస్తున్నారు.

'కూటమిని కూలదోస్తేనే ప్రజా సంక్షేమం'

కంకిపాడు: మాయమాటలు చెప్పే కూటమిని కూలదోస్తేనే ప్రజా సంక్షేమ రాజ్యం అధికారంలోకి వస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కంకిపాడు పట్టణంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రోడ్ షో, బస్టాండు కూడలిలో బహిరంగ సభ నిర్వహించారు. సభలో జోగి రమేష్ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ కానీ, అంతకు ముందు కానీ ఏ రోజైనా చంద్రబాబు ప్రజా సంక్షేమం గురించి ఆలోచించాడా? అని ప్రశ్నించారు. దోచుకోవటం, దాచుకోవటం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. అమరావతి పేరుతో భ్రమరావతి చూపాడని ధ్వజమెత్తారు. అభివృద్ధి పేరుకే కాగితాల్లో ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతోందన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి రాకుండా చేసేందుకు చంద్రబాబు, పవన్, మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారి మాయమాటలు నమ్మొద్దని హితవు పలికారు. ఓటు అనే ఆయుధంతో కూటమిని బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరు అసెంబ్లీ స్థానానికి తనను, మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి సింహాద్రి చంద్రశేఖర్‌రావును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత చలసాని స్మిత గౌతమ్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్ బాకీ రమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్రలను గమనించాలి



జొన్నపాడులో ఎమ్మెల్యే కొడాలి నానికి జేజేలు పలుకుతున్న మహిళలు

- రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలి
- గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి నాని
- మండలంలో ముగిసిన ఎన్నికల ప్రచారం

నందివాడ: రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రలను ప్రజలందరూ గమనించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. మండలంలోని జనార్దనపురం(జొన్నపాడు) గ్రామంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొడాలి నానిపై పార్టీ శ్రేణులు పూల వర్షం కురిపిస్తూ, గజమాలలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చారు. గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే కొడాలి నాని పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌ను, గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొడాలి నాని మాట్లాడుతూ ప్రజలందరికీ మంచి చేసిన సీఎం జగన్‌కు ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఇంటింటికీ వెళ్లి పేదలకు పెన్షన్లు అందిస్తున్న వలంటరీ వ్యవస్థను చంద్రబాబు అండ్ కో ఆపేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజలను తప్పు దోవ పట్టించేందుకు చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్నారు. 2014లో కూటమి మేనిఫెస్టో పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం మళ్లీ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసేందుకు మరోసారి చంద్రబాబు రెడీ అయ్యారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, వైస్ ఎంపీపీ కొప్పుల జయరాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, పార్టీ నాయకులు కొండపల్లి కుమార్‌రెడ్డి, మలిరెడ్డి రవిరెడ్డి, కొండపల్లి రంగారెడ్డి, కొల్లారెడ్డి మధురెడ్డి, మలిరెడ్డి నాగిరెడ్డి, కోటే నాగేశ్వరరావు, బట్టిపాటి శ్రీనివాసరెడ్డి, కుందల నాగరాజు, తోట నాగరాజు, మొండ్రు వెంకటేశ్వరరావు, చింతాల నాగూర్, పరిమి అమృతబాబు, పామర్తి మురళీకృష్ణ, బేతపూడి నవరత్నరాజు, రాజులపాటి చంద్రశేఖర్, ఎంపీటీసీలు గోవాడ నిర్మలకుమారి, వెన్న ప్రభావతి, గుజ్జుల చైతన్యజ్యోతి, పిట్టా విశ్రాంతమ్మ, గుత్తా సత్యనారాయణ(చిన్ని), సచివాలయ కన్వీనర్ దేశిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు తాత మరియమ్మ, తెన్నేటి భాస్కర రెడ్డి, కలపాల సుధారాణి, సరెళ్ల రత్నకుమారి, తప్పిట ధనలక్ష్మి, జాజుల జ్యోత్స్నదేవి పాల్గొన్నారు.



పూలవర్షంతో ఎమ్మెల్యే కొడాలి నానికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు